క్లుప్తంగా

19న 'రన్ ఫర్ జీసస్' శాంతి ర్యాలీ



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఫెడరేషన్ ఆఫ్ తెలుగు చర్చస్, అన్ని క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 19న 'రన్ ఫర్ జీసస్'(ఏసు కోసం పరుగు) శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సీఎస్ఐ కృష్ణా గోదావరి డయాసిస్ బిషప్ మోస్ట్ రెవరెండ్ తంటేపూడి జార్జి కొర్నేలియస్ తెలిపారు. బిషప్ అజరయ్య స్కూల్ ప్రాంగణంలోని ఆల్ సెయింట్ చర్చి వద్ద బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో శాంతిర్యాలీ టీ షర్ట్స్‌ను ఇతర క్రైస్తవ ప్రతినిధులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బిషప్ జార్జి కొర్నేలియస్ మాట్లాడుతూ.. శాంతి ర్యాలీని విజయవాడతో పాటు ఏపీ, తెలంగాణాలోని 600 కేంద్రాల్లో నిర్వహిస్తున్నామన్నారు. ర్యాలీలో పెద్ద సంఖ్యలో క్రీస్తు విశ్వాసులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. రెవరెండ్ అల్లూరి విశ్వప్రసాద్, పాస్టర్ ప్రవీణ్ శీలం, బెల్లంకొండ శివాజీరాజు పాల్గొన్నారు.

29 మంది మందుబాబులకు జరిమానా

విజయవాడలీగల్: మద్యం సేవించి వాహనాలు నడిపిన 29 మంది మందుబాబులకు 8వ అదనపు జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి లెనిన్‌బాబు జరిమానా విధించారు. నగర పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలో 5వ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో మద్య సేవించి వాహనాలు నడిపిన వారిలో 11 మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు, 18 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. ప్రతి రోజు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి.. పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. వాహన చోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు సూచించారు.

క్రికెట్ టోర్నీలో కమర్షియల్ ట్యాక్స్ ఉద్యోగుల రాణింపు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కమర్షియల్ ట్యాక్స్ వెంకటగిరి సర్కిల్ ఆధ్వర్యంలో ఆ శాఖ ఉద్యోగులకు జరిగిన రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో విజయవాడ డివిజన్‌కు చెందిన ఉద్యోగుల టీమ్ రన్నర్స్‌గా నిలిచి కప్‌ను గెలుచుకున్నారు. కమర్షియల్ ట్యాక్స్ చిత్తూరు డివిజన్ సౌజన్యంతో వెంకటగిరిలో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు టోర్నమెంట్‌ను నిర్వహించారు. అందులో భాగంగా విజయవాడ డివిజన్‌కు చెందిన టీమ్ జి.కిరణ్‌కుమార్ కెప్టెన్‌గా ద్వితీయ స్థానంలో నిలిచి రన్నర్ కప్‌ను గెలుచుకున్నారు. ఈ సందర్భంగా విజయవాడ డివిజన్ 1, 2 జాయింట్ కమిషనర్ ఎస్.ప్రశాంత్‌కుమార్‌ను విజయం సాధించిన ఉద్యోగుల బృందం కలిసి కప్‌ను అందించారు. ప్రశాంత్‌కుమార్ ఉద్యోగులను అభినందించారు. ఇదే స్ఫూర్తితో ముున్ముందు మరిన్ని విజయాలను అందుకోవాలని సూచించారు.

విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ కొత్తపేటలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న మైనర్ బాలిక అదృశ్యమైన ఘటనపై బాలిక అమ్మమ్మ ఫిర్యాదుతో టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌లో మరుపిళ్ల పోలయ్య, పార్వతి నివసిస్తున్నారు. వారి కుమార్తె, అల్లుడు చనిపోవడంతో వారి ఇద్దరు ఆడపిల్లలను పోలయ్య దంపతులు పెంచుతున్నారు. ఈ క్రమంలో శ్రీనివాస మహల్ వద్ద గల ఓ మున్సిపల్ స్కూల్‌లో వారి పెద్ద మనుమరాలు(16) తొమ్మిదో తరగతి చదువుతోంది. ప్రస్తుతం పరీక్షలు జరుగుతున్నందున ఈ నెల 15వ తేదీ ఉదయం 7.30 గంటలకు పరీక్ష రాసేందుకు పాఠశాలకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. గతంలో కూడా ఆ బాలిక పలుసార్లు ఇంటి నుంచి వెళ్లిపోయి సాయంత్రానికి ఇంటికి వచ్చేది. బాలిక ఆచూకీ కోసం పలు చోట్ల విచారించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థులు, ఉపాధ్యాయులకు సన్మానం

మైలవరం: ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, అందుకు కృషి చేసిన ఉపాధ్యాయులు అభినందనీయులని డెమోక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను అన్నారు. ఇటీవల విడుదలైన ప్లస్ టులో ఉత్తమ ఫలితాలు సాధించిన ఎంబీఎం జిల్లా పరిషత్ విద్యార్థులు, ఉపాధ్యాయుల అభినందన కార్యక్రమం మైలవరం ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ప్లస్ టూలో బుధవారం జరిగింది. డి.శ్రీను మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో కూడా మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఎన్‌టీఆర్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పి. నాగరాజు, సేవాదళ్ జిల్లా కన్వీనర్ ఎ. శ్రీనివాస్, రాష్ట్ర మహిళా కార్యదర్శి కేవీఎల్ నాంచారమ్మ, మండల అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆర్‌వీఎస్ రామకృష్ణారావు, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాణిజ్య కూడలిలో అవస్థలు



ప్రధాన వ్యాపార కూడలి శివాలయం వీధి



పాతబస్తీ మెయిన్‌బజార్

- పాతబస్తీ మెయిన్ బజార్ ప్రాంతాల్లో కానరాని పబ్లిక్ టాయిలెట్స్
- నిత్యం లక్షలాది మంది రాకపోకలు సాగించే మార్కెట్లు
- వ్యాపారులు, వినియోగదారులు ఇక్కట్ల పాలవుతున్న వైనం
- పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలోనే విజయవాడకు వాణిజ్య రాజధానిగా పేరు. అందులోనూ నగరంలోని పాతబస్తీ పరిసర ప్రాంతాలన్ని ప్రధాన వ్యాపార కూడళ్లతో నిత్యం కళకళలాడుతూ ఉంటాయి. చుట్టుపక్కల జిల్లాల నుంచి ఇక్కడకు లక్షలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం వందల కోట్ల టర్నోవర్ జరిగే వ్యాపార సముదాయాలు సైతం పాతబస్తీలో అనేకం ఉన్నాయి. అయితే వచ్చిన వినియోగదారులకు సరైన వసతులు లేకపోవటంతో అల్లాడుతున్న పరిస్థితులు చోటుచేసుకుంటున్నాయి. ప్రతి రోజూ వివిధ వస్తువుల కొనుగోళ్ల నిమిత్తం పాతబస్తీ మార్కెట్లకు వచ్చే వినియోగదారులకు అందుబాటులో పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధానంగా మహిళలు ఏదైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడి పబ్లిక్ టాయిలెట్స్ కోసం వెతికితే దరిదాపుల్లో ఎక్కడా కనపడవు. దీంతో వారి పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది.

రెండున్నర లక్షల మంది రాకపోకలు

పశ్చిమ నియోజకవర్గంలో సుమారు వందకు పైగా హోల్‌సేల్ అసోసియేషన్లు కొనసాగుతున్నాయి. వాటి పరిధుల్లో వేలాది దుకాణాలు వన్‌టౌన్, పాతబస్తీ తదితర ప్రాంతాలను కేంద్రాలుగా చేసుకొని వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తుంటాయి. దానికి తోడు రాష్ట్రంలోనే రెండో అతి పెద్ద దేవాలయమైన శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం సైతం పాతబస్తీలోనే ఉంది. ఇక్కడ వివిధ వస్తువులను కొనుగోలు చేసేందుకు, అమ్మవారిని దర్శించుకునేందుకు నిత్యం రెండు నుంచి రెండున్నర లక్షల మంది ప్రజానీకం ఇక్కడకు రాకపోకలు సాగిస్తుంటారు. వారితో పాటుగా ఆయా దుకాణాల్లో పని చేసే గుమస్తాలు, కార్మికులు, యజమానులు లక్ష మందికిపైగా ఉన్నారు. వీరంతా పబ్లిక్ టాయిలెట్స్ అందుబాటులో లేక అనేక అవస్థలు పడుతున్నారు.

రూ.కోట్లు పన్నులు కడుతున్నా పట్టించుకోవటం లేదు

పాతబస్తీ నుంచి ప్రభుత్వానికి కోట్లాది రూపాయాలు పన్నులు చెల్లిస్తున్నా స్థానిక వ్యాపారులకు, వినియోగదారులకు కనీస మౌలిక సదుపాయాలను కల్పించటంలేదని వ్యాపార వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ప్రధానంగా వినియోగదారులు అందుబాటులో మరుగుదొడ్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, తమ దృష్టికి తీసుకొచ్చినా ఏమి చేయలేకపోతున్నామని వారు చెబుతున్నారు. పన్నులు కట్టించుకునే అధికారులు కనీసం ఆయా ప్రాంతాల్లో కనీస ఏర్పాట్లను సైతం పరిశీలించి, మెరుగైన సదుపాయాలను కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మరుగుదొడ్లు ఏర్పాట్లు చేయాలి..



పాతబస్తీలో లక్షలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. కోట్లాది రూపాయలు ఇక్కడ వ్యాపారులు ప్రభుత్వానికి వివిధ రూపాల్లో పన్నులు చెల్లిస్తున్నారు. కానీ వచ్చిన వినియోగదారులకు సరైన సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా మహిళలు, వృద్ధుల పరిస్థితి ఇబ్బందిగా ఉంది. కనీసం మరుగుదొడ్లు సైతం లేవు. వీటిపై అధికారులు దృష్టి పెట్టాలి.

– గోకవరపు మురళీకృష్ణ, వ్యాపార సంఘ నేత

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

భవానీపురం(విజయవాడపశ్చిమ): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మూడవ రోజైన బుధవారం కొత్తపేట అగ్నిమాపక అధికారి తలశిల శ్రీనివాసరావు నేతృత్వంలో రామరాజ్యనగర్ ప్రాంతంలోని ఎస్‌కేటీ వెస్ట్ మెడోస్ అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు మంటలను అదుపు చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా ప్రదర్శించి చూపారు. అగ్నిమాపక వారోత్సవాలకు సంబంధించిన బ్యానర్‌ను ప్రదర్శిస్తూ అపార్ట్‌మెంట్లలో నివసించే గృహిణులకు గ్యాస్ స్టవ్ వినియోగించేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్యాస్ లీకేజీ, రెగ్యులేటర్ ట్యూబ్ పాడైపోవడం, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదాలు సంభవిస్తే వాటిని నివారించే విధానాలను వివరించారు. ఐఎస్ఐ మార్క్ కలిగిన రెగ్యులేటర్, ట్యూబ్ పరికరాలను వినియోగించటం, షార్ట్ సర్క్యూట్‌లను అరికట్టే విధంగా మినీయేచర్ సర్క్యూట్ బోర్డ్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి



అధికారులతో సమీక్షిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థలోని వివిధ శాఖాధిపతులంతా నగరాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర చెప్పారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో అన్ని శాఖాధిపతులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరాభివృద్ధికై జరుగుతున్న పనులను సమీక్షించారు. నగరంలో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. మంజూరైన ఇంజినీరింగ్ పనులను సిబ్బంది త్వరగా పూర్తి చేయాలన్నారు. పనుల కార్యాచరణలోనూ అభివృద్ధి కనపడాలని అధికారులను ఆదేశించారు. ఎస్టేట్ విభాగం పరిధిలోకి వచ్చే అన్ని ఆస్తులు ఫైర్ ప్రూఫ్‌గా ఉండాలని, దానికి ఫైర్ ఆఫీసర్ ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు.

నగరంలో పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణ జరగాలి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణ జరగాలని, నిర్వహణలో ఎటువంటి లోపం ఉండకూడదని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన బుధవారం ఎంజీ రోడ్, ఈట్‌స్ట్రీట్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో చెత్త సేకరణ నిరంతరాయంగా జరగాలన్నారు. ప్రతి రోజూ ఇంటి వద్దనే చెత్త సేకరించాలని, 100 శాతం చెత్త సేకరణ ఇంటి వద్దనే జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అందుకు అనుగుణంగా అవసరమైన వాహనాలను ఇంజినీరింగ్ సిబ్బందితో సమన్వయం పరుచుకొని ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజారోగ్యం- ఇంజినీరింగ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రతి రోజు వ్యర్థాల సేకరణ పూర్తిస్థాయిలో జరగాలంటే ఎలాంటి చర్యలు తీసుకోవాలి వంటి అంశాలపై అధికారుల నుంచి వివరాలు తీసుకున్నారు. పర్యటనలో ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించాలి..

అనధికార హోర్డింగ్‌లను, కట్టడాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని చీఫ్ సిటీ ప్లానర్‌ను కమిషనర్ ఆదేశించారు. అధికారులందరూ సమన్వయంతో ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించి, నగరాన్ని అభివద్ధి పథంలో నడపాలని చెప్పారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) జి.సృజన, సూపరింటెండెంట్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్య కుమారి, ప్రాజెక్ట్ ఆఫీసర్ యూసీడీ పి.వెంకటనారాయణ, డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, అకౌంట్ ఆఫీసర్ బి.సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులపై అధికార పార్టీ వేధింపులు ఆపాలి



బీసెంట్ రోడ్డులోని అన్సారీ పార్క్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు, చిరువ్యాపారులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బీసెంట్ రోడ్డులో 50 ఏళ్లకు పైగా చిరువ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారిపై అధికార పార్టీ వేధింపులు ఆపాలని ఎన్టీఆర్ జిల్లా సీఐటీయూ నాయకుడు దోనేపూడి కాశీనాథ్ అన్నారు. బుధవారం బీసెంట్ రోడ్డులోని అన్సారీ పార్క్ ఎదురుగా చిరువ్యాపారులు ధర్నా నిర్వహించారు. మద్దతుగా పాల్గొన్న కాశీనాథ్ మాట్లాడుతూ.. చిరు వ్యాపారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. అధికార పార్టీ నేతలు చిరువ్యాపారుల జీవనోపాధిని దెబ్బతీయాలని చూస్తున్నారని అన్నారు. వ్యాపారస్తుల మధ్య గొడవలు సృష్టించి లబ్ధి పొందేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. సెంట్రల్ సిటీ సీఐటీయూ అధ్యక్షుడు కె.దుర్గారావు మాట్లాడుతూ ఎన్నికల ముందు చిరు వ్యాపారస్తులకు రక్షణ కల్పిస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తర్వాత జీవనోపాధిని దెబ్బతీయడం సమంజసం కాదన్నారు. సీఐటీయూ సెంట్రల్ సిటీ కోశాధికారి వై.సుబ్బారావు, నగర నాయకులు బాలబొమ్మ లక్ష్మణ, విజయవాడ హాకర్స్, తోపుడు బండ్ల యూనియన్ సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు బెవర వెంకటేశ్వరరావు, సీహెచ్ మురళి, బెవర శ్రీను, ఎస్కే మస్తాన్, వై.స్రవంతి, సూరమ్మ, బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ప్రారంభం

కృష్ణలంక(విజయవాడతూర్పు): పదో తరగతి, ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులకు ఎం.బి.విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నడుస్తున్న కంప్యూటర్ శిక్షణా కేంద్రంలో ఈ నెల 21 నుంచి కంప్యూటర్ కొత్త బ్యాచ్‌లకు శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ విభాగం ఇన్‌చార్జి టి.క్రాంతికిరణ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎం.ఎస్.ఆఫీస్, డీటీపీ, ఫొటోషాప్ కోరల్‌డ్రా, ట్యాలీ, సీ లాంగ్వేజ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. గత 9 సంవత్సరాలుగా అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీతో జాబ్ ఓరియంటెడ్‌గా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఆసక్తి కలవారు గవర్నర్‌పేటలో రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యాలయంలో గానీ, 90145 41958, 94900 98042 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.


గ్రంథాలయ పునర్వికాస సభను విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శివప్రసాద్ తదితరులు

విజయవాడకల్చరల్: జాతి ఉన్నతిని, ఔన్నత్యాన్ని చాటే గ్రంథాలయాలకు పూర్వవైభవం తీసుకురావాలని.. ఈ ఉద్యమంలో కవులు, రచయితలు, పబ్లిషర్స్ భాగస్వాములు కావాలని గ్రంథాలయ పునర్వికాస వేదిక కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ పిలుపు నిచ్చారు. వేదిక ఆధ్వర్యంలో బుధవారం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. శివప్రసాద్ మాట్లాడుతూ.. స్థానిక గ్రంథాలయ వ్యవస్థ నిర్వీర్యమైపోయిందన్నారు. వ్యవస్థకు పూర్వ వైభవం తీసుకురావడానికి రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో చైతన్యం తీసుకురావడానికి వేదిక ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని తెలిపారు. ఈ నెల 27వ తేదీ ఆదివారం బందరు రోడ్డులోని మాకినేని బసవపున్నయ్యా విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో విద్యాసంస్థలు, గ్రంథాలయాలు, సాంకేతిక రంగంలో పుస్తక పఠనం, పౌరగ్రంథాలయాలు, సమస్యల పరిష్కార మార్గాలు అంశంగా పలువురు తమ అభిప్రాయాలను తెలియజేస్తారని వివరించారు. వేదిక కీలక బాధ్యుడు బెల్లపు బాబ్జి మాట్లాడుతూ ఈ సమావేశంలో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల కవులు, రచయితలు, పుస్తక విక్రేయతలు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతలు పాల్గొంటారని తెలిపారు. మనోహర నాయుడు, లక్ష్మయ్య, లక్ష్మి, వెంకటనారాయణ, చలపాక ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ఉద్యమ పోస్టర్‌ను అతిథులు ఆవిష్కరించారు.

శీతల పానీయాలు వద్దు.. పండ్ల రసాలు ముద్దు



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆరోగ్యానికి హానికరమైన శీతల పానీయాలను నివారించాలని, పండ్ల రసాలు, కొబ్బరి బోండాలు, వ్యవసాయ ఉత్పత్తులను ప్రచారం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్ర డిమాండ్ చేశారు. 'శీతల పానీయాలు వద్దు, పండ్ల రసాలు ముద్దు' అంటూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో లెనిన్ సెంటర్‌లో ప్రదర్శన నిర్వహించారు. ఏఐవైఎఫ్ కార్యకర్తలు కూల్ డ్రింక్స్ పారబోసి, కొబ్బరి, బత్తాయి, పుచ్చకాయ, ఇతర పండ్లతో ప్రదర్శన నిర్వహించారు. పరుచూరి రాజేంద్ర మాట్లాడుతూ.. వేసవిలో శీతల పానీయాలు తాగడంతో అనేక అనర్థాలు ఉన్నాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం, సినీ ప్రముఖులు వారి ఆదాయం కోసం శీతల పానీయాలపై ప్రచారం చేయొద్దని.. పండ్లు, కొబ్బరి బోండాలు, వ్యవసాయ ఉత్పత్తులను ప్రచారం చేయాలని హితవు పలికారు. ఏఐవైఎఫ్ నగర అధ్యక్షుడు కంచర్ల భార్గవ్, కార్యదర్శి లంకా గోవిందరాజులు, సీపీఐ నాయకుడు తాడి పైడయ్య, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకుడు ఎం.సాయికుమార్, షాదిక్, సింగంశెట్టి మోహన్ ప్రసాద్, ఐ.ఆంజనేయులు, శ్రీరం రవికుమార్, కంది ఆదినారాయణ, జి.రవి, గంట మమత, నరేష్, షైనీ, స్వప్న, సరోజిని, నాగ పార్వతి, దమ్ము రమేష్ పాల్గొన్నారు.

క్రైస్తవుల శాంతి యాత్ర

మైలవరం: హింస, చెడు మార్గాన్ని విడిచి ప్రజలందరూ ఐకమత్యంతో జీవించాలని విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ అనిల్ ఫ్రాన్సిస్ అన్నారు. మైలవరం శాంతినగర్‌లోని ఆర్‌సీఎం విచారణ దేవాలయం నుంచి క్రైస్తవులు ప్రపంచ శాంతి కోరుతూ ర్యాలీ నిర్వహించారు. చెవుటూరు కలువగిరి కొండ సిలువ వద్దకు పాదయాత్ర నిర్వహించారు. రెవరెండ్ ఫాదర్ జయరాజు దివ్య బలిపూజ జరిపించారు. భక్తులకు చెవుటూరు యూత్ సంఘస్తులు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. 16 సంఘాల విశ్వాసులు, మరియదళ సభ్యులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే భవిత



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ నగేష్‌బాబు తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మత్తు పదార్థాలకు దూరంగా ఉన్నప్పుడే విద్యార్థులు అత్యుత్తమమైన భవిష్యత్‌ను పొందుతారని సూపరింటెండెంట్ ఆఫ్ ఈగల్ కె.నగేష్ బాబు అన్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో 'మాదక ద్రవ్యాలు వద్దు – నైపుణ్యాలు ముద్దు' అంశంపై బుధవారం సదస్సును నిర్వహించారు.

విద్యపైనే దృష్టి పెట్టాలి..

ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన నగేష్‌బాబు మాట్లాడుతూ.. విద్యార్థులు మాదక ద్రవ్యాల వినియోగం వలన చట్టపరమైన పరిణామాలను, సామాజిక ప్రభావాలను తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు విద్యపైనే దృష్టి పెట్టాలన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే విద్యార్థులు ర్యాగింగ్, మాదకద్రవ్యాలు వంటి అంశాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ కిరణ్‌కుమార్, వైద్యనిపుణులు డాక్టర్ జగదీష్‌మనో, స్వరాజ్యలక్ష్మి తదితరులు ఆయా అంశాలపై ప్రసంగించారు. కళాశాల ఏవో డాక్టర్ వి.నారాయణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ కాలువల ఆధునికీకరణకు వినతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నాగార్జునసాగర్ ప్రాజెక్టు(ఎన్ఎస్‌పీ) కాలువల ఆధునికీకరణకు గ్రాంట్ మంజూరు చేయాలని 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అర్వింద్ పనగారియాకు ఎన్ఎస్‌పీ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ వినతిపత్రం సమర్పించారు. బుధవారం విజయవాడకు వచ్చిన ఆర్థిక సంఘం చైర్మన్‌ను కలిసి గోపాలకృష్ణ వినతిపత్రం అందజేశారు. కాలువల నీటి నిర్వహణ సామర్థ్యం పూర్తిగా తగ్గిపోయిందని వినతి పత్రంలో పేర్కొన్నారు.

నేడు, రేపు తాగునీటి సరఫరా నిలిపివేత

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ పరిధిలోని చిట్టినగర్ ప్రాంతంలో 11 ఎంజీడీ 300 ఎంఎం డయా ఎంఎస్ పంపింగ్ మెయిన్ పైప్ లైన్ మరమ్మతుల కారణంగా గురువారం, శుక్రవారం నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం, శుక్రవారం ఉదయం నీటి సరఫరా నిలిపివేస్తామన్నారు. రాజీవ్ శర్మ నగర్, మిల్క్ ఫ్యాక్టరీ ప్రాంతం, సయ్యద్ అప్పలస్వామి కాలేజీ వెనుక, భీమనవారిపేట, యానాదుల బజార్, లంబాడీపేట కొండ ప్రాంతాలు, కేటీ రోడ్ గంగానమ్మ గుడి ప్రాంతాలలో తాగునీటి సరఫరా నిలిపివేస్తారు. తిరిగి 18వ తేదీ సాయంత్రం మంచి నీటి సరఫరా జరుగుతుంది. ప్రజలు గమనించి నగరపాలక సంస్థ సిబ్బందికి సహకరించాలని కోరారు.